మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## ప్రజాస్వామ్య విలువలు కాపాడడానికి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

◆ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి మే 4 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికి ఎన్నికలను పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించడం చాలా ముఖ్యమని జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ అన్నారు.రెండవ విడత పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన తర్వాత వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి కేటాయించిన పి.ఓ ఉల సహాయ పిఓ లకు ఎన్నికల నిర్వహణ,ఈ.వి.యం లపై శనివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.శనివారం 360 మందికి ఒక్కో తరగతి గదిలో కొంత మంది పిఓ సహాయ పిఒలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్,అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారులు,సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ రోజున పాటించాల్సిన బాధ్యతలు,చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్,అదనపు కలెక్టర్ అవగాహన కల్పించారు.ఈ.వి.యం ల నిర్వహణలో కానీ,వివిధ రకాల ఫారాలు నింపడంతో కానీ మరేదైనా చిన్న అనుమానం వచ్చినా ఇక్కడే మాస్టర్ ట్రైనర్ ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు.పోలింగ్ రోజున మాత్రం ఒక్క తప్పు జరగడానికి వీలు లేదని తెలిపారు. పి ఒ డైరీని బాగా చదవాలని,పోలింగ్ రోజున ప్రిసైడింగ్ అధికారి అక్కడి పోలింగ్ స్టేషన్ కు సుప్రీం బాస్‌గా ఉంటారని వారి అధికారాలను తెలియజేశారు. ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేందుకు విధుల పట్ల కఠినంగా ఉండాలని సూచించారు.ఏమైనా ఇబ్బందులు వస్తే సెక్టోరియల్ అధికారులకు తెలియజేసి సహాయం పొందాలని సూచించారు. మరో 367 మంది ప్రిసైడింగ్ సాహాయ ప్రిసైడింగ్ అధికారులకు మే 6వ తేదీన శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.ఈ సారి 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని,ఈ.వి.యం ను ఎలా అనుసంధానం చేయాలో ఒకటికి రెండు సార్లు ఇక్కడే చూసుకోవాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్‌లు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఓటర్లను ప్రభావితం చేసే వీడియోలు, సందేశాలను అభ్యర్థి వ్యయ ఖాతాలో జమ చేయాలి

◆ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సౌరబ్



సమీకృత కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు సౌరబ్

**వనపర్తి ప్రతినిధి మే 4 ప్రభాతవార్త:** సోషల్ మీడియా ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే విడియోలను,సందేశాలను పకడ్బందీగా పసిగట్టి అబ్యర్థి వ్యయ ఖాతాలో జమ చేయాలని నాగర్‌కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సౌరబ్ అధికారులను ఆదేశించారు.శనివారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం వ్య పరిశీలకులు సౌరబ్ వనపర్తి జిల్లాను సందర్శించి జిల్లా కలెక్టర్ తో సమావేశం అయ్యారు.అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వార్ తో కలిసి మీడియా సరిటిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ద్వారా ప్రకటనలు,పెయిడ్ న్యూస్,సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారు.ఇప్పటి వరకు ఎన్ని ప్రకటనలు గుర్తించారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమీకృత కంట్రోల్ రూమ్ ను పరిశీలించిన ఆయన ఎఫ్ ఎస్ టి,ఎస్ ఎస్ టి బృందాల పనితీరును పరిశీలించారు.సి విజిల్ యాప్,1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు ,పరిష్కరించిన సమయాన్ని ఆన్లైన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు ,పరిష్కరించిన సమయాన్ని ఆన్లైన్ ద్వారా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.అనంతరంఅకౌంట్స్ బృందంతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలని షాడో రిజిస్టరును ఎప్పటికప్పుడు పరిశీలించి తమ వద్ద ఉన్న రికార్డులతో సరిచూసుకోవాలని ఆదేశించారు.పోటీలో ఉన్న అభ్యర్థుల ఖర్చు,ఎన్నకల వ్యయ లెక్కింపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక నిఘా పెట్టాలని,అనుమానిత లావాదేవిలను గుర్తించి వారిపై నిఘా పెట్టాలని,అనుమానిత లావాదేవీలను గుర్తించి వారిపై నిఘా పెట్టాలన్నారు.10 లక్షల కన్న ఎక్కువ డబ్బులు ఏదైనా బ్యాంకు నుండి విత్ డ్రా అవుతుందా,బ్యాంకు ద్వారా డబ్బు సరఫరా చేసే వాహనాల్లో సరైన లెక్కలు, సంబంధించిన క్యూఆర్‌కోడ్ ఉందా అనేది చూడాలని సూచించారు.సీ విజిల్ యాప్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్,ఎ ఒ భాను ప్రకాష్,డీపీఆర్‌ఓ సీతారాం నాయక్ ఉన్నారు.

జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై

## ఘోర రోడ్డు ప్రమాదం

- బావబామ్మర్దులు దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు

**కల్వకుర్తి, మే 04 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం తాండ్ర గేటు సమీపంలో జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో బావబామ్మ ర్దులు మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... వంగూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ (33), కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన బోయ రామకృష్ణ (28)లు బావ బామ్మర్దులు. బావ వెంకటేష్ కుటుంబ సభ్యుల ఇంట్లో శుభకార్యానికి బోయ రామకృష్ణ కుటుంబ సభ్యులతో హజరై అక్కడ కార్యక్రమంలో పాల్గొని పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై రామకృష్ణ, వెంకటేష్‌లు కల్వకుర్తికి బయలుదేరారు. మార్గమధ్యలో తాండ్ర గేటుసమీపంలో జాతీయ రహదారి ప్రక్కన ఆగిఉన్న లారీని వెనుక వైపు నుంచి బలంగా ఢీకొట్టడంతో ప్రమాదంలోఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు.మృతదేహలను పోస్టు మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటేష్‌కు భార్య, ఇద్దరు అమ్మాయిలు ఉండగా,రామకృష్ణ భార్య ప్రస్తుతం కడుపుతో ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యులఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

**మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటేష్, రామకృష్ణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి రోడ్డు ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఎమ్మెల్యే రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించి కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.



మృతి చెందిన వెంకటేష్(ఫైల్)



మృతి చెందిన రామకృష్ణ (ఫైల్)



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కురుమూర్తిరాయుడి సాక్షిగా..

# రుణమాఫీ చేస్తా..



- మోడీ వచ్చిపోవుడు తప్పా ఇచ్చేది ఎం లేదు..
- మోడీ అమిష్‌తా ఢిల్లీ పోలీసులతో బెదిరిస్తున్నరు..
- డీకే అరుణ పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా తెచ్చి ఓట్లు అడగాలి..
- వంశీచంద్‌రెడ్డిని గెలిపించండి..
- పాలమూరు అభివృద్ధి చేసే బాధ్యత నాది..
- కొత్తకోట కార్నర్ మీటింగులో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు



**కొత్తకోట, మే 4 ప్రభాతవార్త:** మోడీ తెలంగాణ రాష్ట్రానికి ఏమిచ్చిందు ఏమి తెచ్చిందు గాడిద గుడ్డు అని మోడీ రాష్ట్రానికి అమావాస్యకు పున్నానికి వచ్చిపోవుడు తప్ప తెచ్చింది ఏమి లేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం పాల మూరు పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని చౌరస్తాలో ఏర్పాటు చేరిన కార్నర్ మీటింగులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు బిజెపి అభ్యర్థి డీకే అరుణ నాపై కక్ష కట్టి రేవంత్ రెడ్డి ని సీఎం కుర్చీ నుండి దింపి ఈడీలతో జైల్లో వేసి ఎస్సి, ఎస్టీ బీసీ మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేసేందుకు మోడీ, అమిత్‌షా తో కుట్ర పన్నుతున్న డీకే అరుణకు ఇలా ఓటు వెయ్యాలో ఆలోచించండని పేర్కొన్నారు. మోడీ అమిత్ షా ఢిల్లీ పోలీసులతో బెదిరింపులు చేస్తున్నారని ఈ బెదిరింపులకు ఇక్కడ ఎవరు బయపడరని మండిపడ్డారు. ఈ రోజు ఇక్కడున్న కురుమూర్తిరాయ స్వామి సాక్షిగా నేను కొలిచి నా దైవం సాక్షిగా ఆగస్టు 15 లోపు రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఒకవేళ చేయకపోతే సీఎం కుర్చీనే వదులుకుంటా అని స్పష్టం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చి ఓట్లు అడుగు అప్పుడు ప్రజలు నిన్ను నమ్ముతారని ఎద్దేవా చేశారు. అప్పట్లో మన పాలమూరు బిడ్డ బూర్గుల రామకృష్ణ ముఖ్యమంత్రి పదవి చేపట్టాడని మళ్లీ 70 ఏండ్ల తర్వాత

-మిగతా4లో..

# ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

● ఎన్నికల సాధారణ పరిశీలకులు టీషేవాంగ్ గ్యాచో భూటియా ● ఎన్నికల విధులపై సమన్వయ సమావేశం



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే04 ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికలను స్వేచ్ఛగా శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా పోలీస్ అధికారులు, ఇతర సిబ్బంది కృషి చేయాలని అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు టీషేవాంగ్ గ్యాచో భూటియా, జిల్లా కలెక్టర్ రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్‌లు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి అయినా ఎస్పై పై స్థాయి అధికారులకు ఎన్నికల సందర్భంగా నిర్వహించాల్సిన విధులను గురించి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఎన్నికల రోజు చేయాల్సిన విధులు, డ్యూటీకి సక్రమమైన యూనిఫాంలో సరైన సమయంలో రావడం, ఓటర్లు అందరితో మర్యాదగా ప్రవర్తించడం పోలింగ్ బూత్‌లోని ప్రొసీడింగ్ ఆఫీసర్ అన్ని విషయాలు నిర్ణయించే వ్యక్తి అతని సలహా మేరకు నడుచుకోవడం క్యూ ఏర్పాట్లు సరిగ్గా నిర్వహించడం తదితర అంశాలపై వివరించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ఎన్నికల ప్రచారం చేయకూడదని, పోలింగ్ సిబ్బంది ఓటర్లు, పోలింగ్ ఏజెంట్లకు మర్యాదపూర్వకంగా ఉండడం సహకరించడం ప్రొసీడింగ్ అధికారి అధికారాన్ని సమర్థించడం అతని ఆదేశాలను పాటించడం గుర్తుంచుకోవాలి. ఓటింగ్ కోసం గుంపులో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి సంబంధిత అధికారులకు తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. అవినీతి పద్ధతులను గుర్తించడానికి పోలీస్ స్టేషన్ వద్ద జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు.

**ఎన్నికల రోజు చేయకూడనివి...**

ఏ వర్గం వారికి ఆతిథ్యం తీసుకొనరాదని, భోజనం ఏర్పాట్లు డిపార్టుమెంట్ ద్వారానే చూసుకోవాలని, నిర్ణయింపబడిన డ్యూటీ పాయింట్ పోలింగ్ స్టేషన్ ఆవరణ వదిలి వెళ్లరాదని, ఓటర్ల వద్ద నుండి ఎటువంటి వస్తువులు అనగా ఫోన్లు పార్సు్న తీసుకొనరాదని సూచించారు. అదేవిధంగా పోలింగ్ బూత్‌లోకి ఎలాంటి వస్తువులను అనుమతించరాదని, ఏ పక్షం నుండి ఎటువంటి సహాయాన్ని అంగీకరించవద్దని తెలిపారు. సమావేశంలో పోలీస్ అబ్జర్వర్ కలురామ్ రావత్, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్, వరుణ్‌స్వామి, ఐఆర్ఎస్, జిల్లా కలెక్టర్ రవినాయక్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్, ఐపిఎస్, ట్రైనీ ఐపిఎస్ చిత్తరంజన్, ఐటిబిపి కమాండెంట్ అడోలీ చాసీ, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, సిబ్బంది

# పాలమూరు @ రెడ్‌జోన్

- నారాయణపేటలో అత్యధికంగా 46.4డిగ్రీలు నమోదు
- ఉదయం 8గంటల నుంచే ఉక్కపోత
- కూలర్లు వాడుతున్న తగ్గని టెంపరేచర్
- వడగాలులు వీచే ప్రమాదం
- పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు అవసరం



నిర్మానుషంగా మహబూబ్‌నగర్ ప్రధాన రహదారి

**ఉమ్మడి పాలమూరు రెడ్‌జోన్‌లోకి వెళ్లింది. గత రెండు రోజులుగా టెంపరేచర్ 45డిగ్రీల పైనే నమోదు అవుతున్నది. ఉగ్ర భానుడిగా మారి తన ప్రతాపాన్ని చూయిస్తున్నాడు..మార్చి ఆరంభం ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. ఈసారి వేడిగాలులు సైతం ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఎండలు దంచికొడుతుండడంతో జనాలు బయటకు రావడానికి జంకుతున్నారు. ఎండలు పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలుపడంతో జనాలు జంకుతున్నారు. ఎండల తీవ్రతతో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తమైంది.**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 4, ప్రభాతవార్త**

ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సగటున 3నుంచి4 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. వడగాల్పులు వీచే అవకాశం ఉందని ప్రజలు అవరమైతేనే బయటకు రావాలని సూచిస్తున్నారు.గత ఏడాది జూలై నుంచి ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్నది.వర్షాలు తక్కువగా కురియడం, సాధారణం కంటే తక్కు వర్షపాతం నమోదు కావడం ఎండ తీవ్రత పెరిగేందుకు కారణాలుగా చెప్పవచ్చు. చిన్న పిల్లలు, వృద్ధులను అవసరమైతే తప్పా అనవసరంగా ఉండలకు బయటకు పంపొద్దని అధికారులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒక వేళ బయటకు వెళ్లిన నీళ్లబాటిల్ వెంట తీసుకెళ్లాలని, తరుచూ తెలంగాణలోని పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, మంచిర్యాల, ములుగు, జగిత్యాల జిల్లాలతోపాటు ఉమ్మడి పాలమూరు రెడ్ జోన్‌లోకి వెళ్లాయి.ఉమ్మడి పాలమూరుజిల్లాలోని నారాయణపేటలో అత్యధికంగా 46.4డిగ్రీల అత్యధికంగా నమోదైంది. ఈ ఏడాదిలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. నీళ్లు తాగాలని చెబుతున్నారు. ఇంట్లో ఓఆర్ఎస్ ప్యాకట్లు ఉంచుకోవడం మంచిదని, పండ్ల రసాలు ఇంట్లోనే తయారు చేసుకోవడం ఆరోగ్యానికి మేలు అని సూచించారు. నారాయణపేట జిల్లాలో ఊట్కూర్‌లో, వనపర్తి జిల్లాలోని పాన్‌గల్ మండలం కేతేపల్లి, జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మండలం వడ్డేపల్లి, మహబూబ్‌నగర్ జడ్చర్ల, నాగర్‌కర్నూల్‌లో జిల్లాలోని కల్వకుర్తిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు అధికారులు చెబుతున్నారు.

**ఇవేం ఎండలు బాబోయ్:** ఎండ తీవ్రత పెరుగడంతో ప్రధాన రోడ్లన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇవేం ఎండలు బాబోయ్ అంటూ ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం నుంచి జాతీయ రహదారులపై సైతం వాహనాల రద్దీ తగ్గిందని చెప్పవచ్చు. చల్లనీ నీళ్లు తాగి ఎండల నుంచి కొంతైనా ఉపశమనం పొందుదామని తాగునీటి కుండలను కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు శీతల పానీయాలు తాగేందుకు జ్యూస్ సెంటర్లు, చల్లదనం కోసం పార్కులను ఆశ్రయిస్తున్నారు. ఐస్ క్రీం పార్లర్లు, చెరుకు రసం, మజ్జిక, నిమ్మరసం దుకాణాలకు గిరాకీ బాగా పెరిగింది. దాదాపు రాష్ట్రమంతా ఇదే పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రోడ్లవెంట, రహదారుల పొడవునా నిమ్మరసం బండ్లు, చెరుకురసం, జ్యూస్ బండ్లు ఏర్పాటు చేయడంతో బాటసార్లు, ద్విచక్రవాహనదాలు, ప్రయాణికులు సేదతీరుతున్నారు. కొంత వరకు ఉపశమనం పొందుతున్నారు. ఇదే అదునుగా భావించి వ్యాపారులు ధరలు పెంచేశారు. గత ఏడాది కంటే రేట్లు దాదాపు రెండింతలు చేసి విక్రయిస్తున్నారు. నిమ్మరసం రసం ఒక గ్లాసు రూ.20 విక్రయిస్తున్నారు. చెరుకు రసం ఒక్క గ్లాసు రూ.30, పండ్ల రసాలు కూడా ఒక్కో గ్లాసు రూ.40నుంచి రూ.100వరకు విక్రయిస్తున్నారు.

**శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు**

| జిల్లా,ప్రాంతం | టెంపరేచర్ |
|---|---|
| నారాయణపేట(ఊట్కూర్) | 46.4 |
| వనపర్తి (కేతేపల్లి) | 46.1 |
| నాగర్‌కర్నూల్ (కల్వకుర్తి) | 46.0 |
| గద్వాల (వడ్డేపల్లి) | 46.0 |
| మహబూబ్‌నగర్ (జడ్చర్ల) | 45.7 |

## ఎన్నికల కోడ్ వల్లే గ్యారంటీలకు బ్రేక్

- ఆరు గ్యారంటీలు తప్పక అమలు చేస్తాం
- కాంగ్రెస్‌తోనే మైనార్టీలు సంక్షేమం
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 04 ప్రభాతవార్త:** మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 32వ వార్డు ఇంఛార్జి ఫక్రుద్దిన్ ఖురేషీ ఆధ్వర్యంలో జనైటల్ ఖురేషి కమిటి మహబూబ్‌నగర్ కమిటి సభ్యులు 300 మంది శనివారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అందుకే ఆరు గ్యారంటీ పథకాలు తెచ్చి పేదరికాన్ని పారద్రోలుతుందని ఇప్పటికే ఐదు గ్యారంటీ పథకాలు అమలవుతున్నాయని, ఎన్నికల కోడ్ వల్లనే కొన్ని సంక్షేమ పథకాలు ఆగిపోయాయని ఆయన చెప్పారు. ఖురేషీ కమ్యూనిటికిమౌలాలి గుట్టదగ్గర కమిటిహాల్ నిర్మాణానికి అవసరమైన సహాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంఛార్జిగా ఉన్న మన మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, 32వ వార్డు ఇంఛార్జి ఫక్రుద్దిన్ ఖురేషి, అబ్దుల్ రెహమాన్ ఖురేషి, ఖాజాపాషా ఖురేషీ, ఉస్మాన్ ఖురేషీ, గౌస్ ఖురేషీ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేకు ఘన సన్మానం



**దేవరకద్ర,మే 04 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డికి శనివారం దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్‌కు చెందిన యువజన కాంగ్రేస్ పార్టీ నాయకుడు చందూగౌడ్ ఘనంగా సన్మానించారు.ఎమ్మెల్యే జన్మదిన వేడుకల సందర్భంగా చందూగౌడ్ ఎమ్మెల్యేకు ఈ సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రేస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపిలోకి చేరిన అడవి అజిలాపూర్ నాయకులు



**దేవరకద్ర,మే 04 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం అడవిఅజిలాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రేస్,బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు శనివారం బీజేపిలోకి చేరారు.నరేంద్రమోడి నాయకత్వం,బీజేపి సిద్ధాంతాలు నచ్చి వారంతా బీజేపి దేవరక ద్ర నియోజకవర్గ ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి అధ్వర్యంలో వారంతా బీజేపిలో చేరారు.పార్టీలో చేరిన వారిని కొండ ప్రశాంత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. వచ్చే ఎన్నికల్లో బీజేపి యంపీ అభ్యర్థి డికే.అరుణమ్మను అత్యదిక మెజార్టీతో గెలిపిస్తామని పార్టీలో చేరిన వారు ధీమా వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రూ.2339 ధర పలికిన సోన

**దేవరకద్ర,మే04 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు శనివారం రైతులు 604 కింటాళ్ళ సోన(ఆర్ఎన్ఆర్) ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.2339 ధర పలికింది.అతి తక్కువగా రూ.2100 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే ఆల



**భూత్పూర్,మే 4,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం వెల్కిచర్ల గ్రామంలో శనివారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్త దేవరకొండ పెద్ద భీమయ్య కుమారుడు నరేందర్ వివాహానికి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై నూతన వధూవరుల్ని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు జిల్లా మత్స్యకారసంఘంమాజీ అధ్యక్షుడుమనెమోని సత్యనారాయణ, భూత్పూర్ మండల రైతు బంధు మాజీ అధ్యక్షుడు మొల్గర నర్సింహు లుగౌడ్, మాజీ ఎంపీటీసీ మేకల సత్యనారాయణ,భూత్పూర్ మండల నీటి తీరువా కమిటీ మాజీ అధ్యక్షుడు సత్తూర్ అశోక్‌గౌడ్,బీఆర్ఎస్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు గడ్డం ప్రేమ్‌కుమార్,కొత్తూర్ నర్సింహులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా సదస్సుకు తరలిన సిపిఎం శ్రేణులు




**అమరచింత మే4 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సిపిఎం పార్టీ అధ్వర్యంలో జరిగే సదస్సుకు శనివారం అమరచింత మండల కేంద్రం నుండి సిపిఎం శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఎండి మహమూద్, సిపిఎం మండల కార్యదర్శి, జిఎస్ గోపి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ 10 ఏళ్లలో దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా కార్పోరేట్ సంస్థలకు అప్పజెప్పారని పదేళ్లలో ఎక్కడ అభివృద్ధి జరగలేదని ఆయన అన్నారు. నరేంద్రమోడీ ఎన్నికలలో ఏడాదికి కోటి ఉద్యోగాలు అమలు చేస్తామని చెప్పిన 10 ఏళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని ఆయన డిమాండు చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో అభివృద్ధి పేరిట ఓట్లు అడగకుండా రామాలయం పేరుతో దేశంలో బిజెపి మతకలహాలు సృష్టించడానికి ప్రయత్నిస్తుందని, ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి పార్టీ తో పాటు మిత్రపాక్షాలను ఓడించాలని వారు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు,బి.వెంకటేశ్, ఆర్ఎన్‌రమేశ్, అజయ్, బుచ్చన్న, రాఘవేంద్ర, శ్యాంసుందర్, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న బహిరంగ సభ వేదిక నిర్మాణ పనులు



**ఇటిక్యాల,మే 04 ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తా షేక్‌పల్లి రోడ్డువైపు ఖాళీ స్థలంలో 5వ తేదీ ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన జనజాతర బహిరంగ సభ వేదిక నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ, మంత్రులు, ఎంపి అభ్యర్థి మల్లురవి, ఇతర ముఖ్య నేతలు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలోనే ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు బహిరంగ సభ వేదిక నిర్మాణ పనులు, గ్యాలరీల ఏర్పాటు, సభా వేదిక స్టేజీ వంటి పనులను రోజులుగా మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, జోగుల రవి, నీలి శ్రీనివాసులు, శ్యామ్‌రావు, వెంకటేష్ యాదవ్, సోమిరెడ్డి రాజకుమార్, రుక్మానందెడ్డి, ఇతర ముఖ్య నేతలు బహిరగ సభ వేదిక నిర్మాణ పనుల పూర్తిపై దృష్టి సారించారు. బహిరంగ సభకు లక్షమంది దాకా నాలుగు నియోజకవర్గాల నుండి హాజరు కావడంతో నాయకులకు కార్యకర్తలకు ఎటువంటిఇబ్బందులు లేకుండా ఉండేందుకు సభా వేదికను, గ్యాలరీలను, ఎండ వేడిమి తట్టుకునేందుకు టెంటులు ఏర్పాటు చేస్తున్నారు.

## పేకాట రాయుళ్లు అరెస్ట్: కేసు నమోదు

**అలంపూర్ మే 4 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల పరిధిలోని ముండ్లదిన్నె గ్రామంలో పేకాట రాయుళ్లను పట్టుకుని కేసు నమోతు చేసినట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం. గ్రామ శివారులో వాగులోకి వెళ్లే దారిలో శుక్రవారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. 9 మంది పేకాట ఆడుతుండగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన నుంచి రూ. 8,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలి

● ఎంపిపి కమల వాల్యానాయక్ ● తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించండి: ఎంపిటిసి వెంకట్ రాంనాయక్

**బాలానగర్, మే 04 ప్రభాతవార్త :** అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం అందించే గృహజ్యోతి పథకం ద్వారా లబ్దిదారులకు 200 యూనిట్ల వరకు ఫ్రీ విద్యుత్‌ని అందిస్తామని ప్రకటించినప్పటికి గ్రామాలలో విద్యుత్ సిబ్బంది లబ్దిదారుల దగ్గర కరెంటు బిల్లులను వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, కావున ప్రభుత్వం అందించే పథకంలో భాగంగా లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఎంపిపి కమల వాల్యానాయక్ సూచించారు. బాలానగర్ మండల ఎంపిడిఓ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో త్రాగునీటి సమస్య, విద్యుత్ సమస్యలు, బాలానగర్ మండలంలో మూతపడిన 11 ప్రాథమిక పాఠశాలకు సంబంధించి వాడివేడిగా చర్చ జరిగింది. ఉమ్మడి తిరుమలగిరి ఎంపిటిసి వెంకట్‌రాం నాయక్ వీటిపై స్పందిస్తూ సంబంధిత అధికారులను నిలదీశారు. జోగ్యనాయక్ తండా, వాన్క్యవత్ తండా, ఫుల్‌సింగ్ తండాలలో మిషన్ భగీరథ వాటర్ అవసరం మేరకు రావడం లేదని, అలాగే ఉమ్మడి తిరుమలగిరి గ్రామంలో విద్యుత్ సమస్య వలన కరెంటు ట్రిప్ కావటం, ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోవడం జరుగుతుందన్నారు. అలాగే పురాతన విద్యుత్ లైన్లు పోలాల్లో వేలాడుతున్న వాటిని, అలాగే ఇంటిపై విద్యుత్ వైర్లను తొలగించాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. ఎవరికైనా ప్రమాదం జరిగి చనిపోతే గాని అధికారులు స్పందించరా అని అధికారులను



మాట్లాడుతున్న ఎంపిపి కమల వాల్యానాయక్ , ఎంపిటిసి వెంకట్‌రాం నాయక్

నిలదీశారు. బాలానగర్ మండలంలో మూతపడిన 11 ప్రాథమిక పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, పాఠశాలలో సరైన సిబ్బంది లేకపోవడం వల్లనే అక్కడ విద్యార్థులు రాక పాఠశాలలు మూతపడినట్లు ఆయన అన్నారు. అధికారులు చొరవ తీసుకుని పాఠశాలలో తిరిగి సిబ్బందిని నియమించి పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంపిపి కమల వాల్యానాయక్, జడ్పీటిసి కళ్యాణి లక్ష్మణ్ నాయక్, వైస్ ఎంపిపి వెంకటచారి, ఎంపిడిఓ శరత్ చంద్రబాబు, స్పెషల్ ఆఫీసర్ బాబురావు, ఎపిఓ రాజశేఖర్, అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ వ్యతిరేక పార్టీలను ఓడించండి

**తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు యం ఏ ఖాదర్ పాష**

**వనపర్తి ప్రతినిధి మే 4 ప్రభాతవార్త :** రాజ్యాంగ వ్యతిరేక పార్టీలైన బిజెపి, బీఆర్ఎస్ లను ఓడించాలని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు యంఏ ఖాదర్ పాష పేర్కొన్నారు.శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలో టీజేస్ పార్టీ కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఖాదర్ పాష మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని,చట్టం ప్రకారం రావాల్సిన అగ్రికల్చర్ యూనివర్సిటీ నాగర్‌కర్నూల్,వనపర్తి,గద్వాల రైల్వే లైను తదితర హామీలను నెరవేర్చడంలో విఫలం అయిన బిజెపి,బిఆర్ఎస్ లకు ఓటు అడిగే నైతిక హక్కు లేదని ఆయన విమర్శించారు. కృష్ణా నది తెలంగాణకు వచ్చే న్యాయమైన వాటా పంచి ఇవ్వలేదని,అవమాన పంపిణీ పదేళ్లుగా యధాతంగా కొనసాగిస్తున్నారని అన్నారు. తెలంగాణ చరిత్రను వక్రీకరించి ఈ ఎన్నికల్లో లబ్ది పొందాలని చూస్తు న్నారని అన్నారు.ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడమే కాకుండా ప్రజల యొక్క వ్యక్తిగత జీవితంలోకి జొరబడే స్థాయికి బరి తెగించారని ఆయన అన్నారు.తమ అధికారంలోకి విచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో లక్షలాది శాశ్వత ఉద్యోగాలను బిఆర్ఎస్ తదితర పేర్లతో తొలగించారని ఆయన పేర్కొన్నారు.మతంపేరుతో ప్రజలని విభజించే నైతికత ఎవరికి లేదని,పదేళ్ల తర్వాత కేసిఆర్‌కి ప్రజలు గుర్తు వచ్చారా? ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునే బాధ్యత ప్రజలదేననీ ఆయన తెలిపారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే కాంగ్రెస్ కు టీజేఎస్ మద్దతు ఇస్తుం దని,నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి ప్రధాన కార్యదర్శి రాజేష్ కుమార్ శెట్టి,జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ,పట్టణ ప్రధాన కార్యదర్శి శాంతారాం నాయక్,మండల నాయకులు ఎండి సమీ,లింగస్వామి,వినోద్ కుమార్,సోఫ్ అలీ,పిక్కిలి బాలయ్య,ఎ.రాజశేఖర్,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న తెలంగాణ జన సమితి నాయకులు

## మాదిగలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలు

-ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు



**భూత్పూర్,మే 4,ప్రభాతవార్త:** కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీలు ఇంతకాలం మాదిగలను నమ్మించి నయవంచన చేశాయని,ఎన్నికలలో మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటూ మోసం చేస్తూ వస్తున్నాయని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ విమర్శించారు.శనివారం భూత్పూర్ పట్టణ కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లెపోగు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడి నేతృత్వంలోని బీజేపీ సర్కార్ ఏర్పడిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ ఆమోదింప జేస్తామని 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీను తుంగలో తొక్కి ఇంతవరకు వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి పంపిణీ ఇంత వరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. మాదిగలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తగిన న్యాయం జరిగిందని అన్నారు.మాదిగలకు కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో బంజరు భూములు పంపిణీ చేశారని గుర్తుచేశారు.గతంలో ప్రధాని నరేంద్రమోడీ పాలమూరు పర్యటనలో పలుమార్లు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని ఇంతవరకు చర్యలు తీసుకోలేదని విమర్శిం చారు.బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలు ఒకటే ఎజెండాను అమలు చేస్తున్నారని,వాటి ధృతరాష్ట్ర కౌగిలిలో మాదిగలు పడొద్దని మల్లెపోగు శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోరింగ్ నర్సింహులు తో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు గడ్డం ఎల్లప్ప,మండి అంజి,గడ్డం శేఖర్,కురుమూర్తి,పరుశురాం,రమేష్ పాల్గొన్నారు.

## హెలిపాడ్ సభాస్థలాన్ని, పార్కింగ్ ప్రవేశాలను పరిశీలించిన డిఐజి

**ఇటిక్యాల మే 4 ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 5వ తేదీ ఆదివారం సాయంత్రం రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా పోలీస్ వాఖ బాధ్యతగా పనిచేయాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసకోవాలని జోగులాంబ జోన్ డిఐజి ఎల్ ఎస్ చౌహాన్ ఆదేశించారు.5వ తేదీ ఆదివారం సాయంత్రం ఎర్రవల్లి చౌరస్తాలో జరిగే బహిరంగ సభ స్థలాన్ని శనివారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ రితిరాజ్ తో కలిసి స్థలాన్ని,పార్కింగ్ ప్రదేశాలను,హెలిపాడ్ ప్రదేశాన్ని జోగులాంబ జోన్ డిఐజి ఎల్ఎస్ చౌహాన్ పర్యవేక్షించారు. ఎన్నికల ప్రచార బహిరంగ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలాగే కాంగ్రెస్ యువనేత,రాహుల్ గాంధీ జన జన జాతర బహిరంగ సభకు రానున్న సందర్భంగా సభ స్థలాన్ని,వాహనాల పార్కింగ్ ప్రదేశాలను,10వ బెటిలియన్ లోని హెలిపాడ్ ప్రదేశాలను వారు ప్రత్యేకంగా పరిశీలించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి కాన్వాయ్ రూట్ మ్యాప్ ను.సభాస్థలి ప్రాంగణం,గ్యాలరీల ఏర్పాటుల ప్రదేశాలను వారు పరిశీలించారు.అలాగే బందోబస్తుకు సంబంధించి పోలీస్ అధికారులకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని,జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ డైవర్షన్



ఎర్రవల్లి చౌరస్తాలో ముఖ్యమంత్రి బహిరంగ స్థలాన్ని పరిశీలిస్తున్న జోగులాంబ జోన్ డిఐజి ఎల్ఎస్ చౌహాన్, జిల్లా ఎస్పి రీతిరాజ్

చేయాలని,విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సజావుగా అయ్యేటట్లు చూడాలని పోలీసు అధికారులకు తెలిపారు. డిఐజి వెంట ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ గుణశేఖర్,బిఎస్పీ సత్యనారాయణ సాయుధ దళ డిఎస్పి నరేందర్ రావు,అంపూర్ సిఐఐ రవి బాబు,ఇటిక్యాల ఎస్సైలు వెంకటేష్ ఉన్నారు.

# ముదిరాజులందరు అభివృద్ధివైపు నడవాలి

● సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 04 ప్రభాతవార్త:** ముదిరాజ్‌లు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయ రంగాలలో అభ్యున్నతి చెందాలని సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి ఆకాంక్షించారు. జడ్చర్ల పట్టణ కేంద్రంలోని చంద్ర గార్డెన్‌లో ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి ఎంపి అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో కులవృత్తి పేరుమీద సామాజిక దోపిడీ చేశారని ఆయన ఆరోపించారు.



చల్లా వంశీచంద్‌రెడ్డి, శివసేనరెడ్డిలను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కెసిఆర్ ఓ పక్క కులాన్ని గుర్తించి మరోపక్క కులాల వారిగా రాష్ట్రంలో సంపదను కొల్లగొట్టారని ఆయన పేర్కొన్నారు. బిజెపి పార్టీ వల్ల దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారిపోవడం చూస్తే ఎస్సీ, ఎస్టీ, బిసి రిజర్వేషన్ల పరిస్థితి ఏమవుతుందో ప్రజలందరూ గమనించాలని ఆయన అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేసి ప్రజా సంక్షేమాన్ని సాధించుకోవాలని ఆయన తెలిపారు. ధైర్యానికి మారుపేరుగా నిలిచిన ముదిరాజ్ బిడ్డల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనదైన ముద్రవేస్తూ ప్రజా పాలనలో బిసిడి, బిసిఎ గా మార్చే దిశగా చర్యలు చేపడుతున్నారనిఆయన తెలిపారు.అనంతరం ఎంపిఅభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, శివసేనారెడ్డిలకు పూలమాలల వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి ఎన్‌పి వెంకటేష్, దుష్యంత్‌రెడ్డి, దత్తాత్రేయ ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, గోనెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి,కేశం నాగరాజుగౌడ్

**అమరచింత మే 4 ప్రభాతవార్త:** విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ అన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తరగతి పరీక్ష ఫలితాలలో అమరచింత పట్టణానికి చెందిని కాజా హుస్సేన్ కూతురు నూర్జహాత్ 9.8 సాధించిన సందర్భంగా శనివారం అమరచింత మండల కేంద్రంలోని డిసిసి జిల్లా కార్యదర్శి,అయూబ్ ఖాన్ శాలువతో ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో ముందుండాలని పుట్టిన గడ్డకు దేశానికి మంచి సేవలు అందించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో డిసిస,జిల్లా కార్యదర్శి,అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు,అరుణ్



పదోతరగతి టాపర్‌ను సన్మానిస్తున్న పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్

కుమార్,కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు,ఏకే వెంకటేశ్వర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు,పోసరి విష్ణు,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు,శ్యామ్ కుమార్,పెద్ద బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అవాస కేంద్రంలో అరుణమ్మ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డికె అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 04 ప్రభాతవార్త :** బిజెపి జాతీ ఉపాధ్యక్షురాలు మహబూబ్‌నగర్ ఎంపి అభ్యర్థి డికె అరుణ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎనుగొండలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆసరా విద్యార్థుల ఆవాస కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారుల సమక్షంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు, స్వీట్లు పంచిపెట్టారు. ఆవాస కేంద్రంలో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్నందుకు చాలా సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం చిన్నారులకు, విద్యార్థులకు పండ్లు, స్వీట్లు అందజేశారు.

**మహిళా మోర్చా ఆధ్వర్యంలో:** బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో డికె అరుణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి సభ్యుతో కలిసి కేక్ కట్ చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపి అభ్యర్థిగా గెలుస్తారని ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో నాయకులు జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, పల్లె తిరుపతి, మహిళా మోర్చా సభ్యులు పాల్గొన్నారు.

## 200 చర్చలు.. 300ల ప్రశ్నలు

- పార్లమెంట్‌లో సంధించిన ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- కొత్త స్టేషన్లు రైల్వే బ్రిడ్జిలు సాధించారు
- ఎక్స్ వేదికగా అభినందించిన కెటిఆర్



**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 04 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ఎంపి, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిపై కెటిఆర్ ప్రశంసల జల్లు కురి పించారు. ట్విట్టర్ వేదికగా ఆయన చేసిన అభివృద్ధి, పార్లమెంటులో ప్రశ్నించిన తీరుపై అభినందించారు. మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఎంపిగా ఉన్న ఐదేళ్లలో పార్లమెంట్‌లో 200కు పైగా చర్చల్లో పాల్గొని, 300ల ప్రశ్నలు సంధించినట్లు తెలిపారు. మన్నె శ్రీనివాస్‌రెడ్డి హయంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన విడియోను ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. మన్నె హయాంలోనే కొత్త రైల్వే స్టేషన్‌లో, రైల్వే స్టేషన్‌లో పునరుద్ధరీకరణ, అందరికరణ పనులు, రైల్వే అండర్ పాస్‌లు వచ్చాయని పేర్కొన్నారు. మన్నె గళం పాలమూరుకు బలం అంటూ ప్రశంసించారు. గులాబీ జెండాను మరోసారి పాలమూరులో ఎగురవేయాలని కోరారు.మన్నె శ్రీనివాస్‌రెడ్డి మచ్చలేని నాయకుడని,ఇలాంటి నేతను పాలమూరు ప్రజలు వదులుకోవద్దని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ



ముఖ్యమంత్రి బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

**ఇటిక్యాల,మే 04 ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికల ప్రచార నేపథ్యంలో మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో షేక్‌పల్లె రోడ్డువైపు ఆదివారం సాయంత్రం జరిగే జనజాతర బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ హాజరు కానుండడంతో శనివారం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్, జిల్లా ఎస్పీ రితిరాజ్, విఐపి సెక్యూరిటీ అధికారులు, జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బహిరంగ సభ స్థలాన్ని సభా వేదిక అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. అలాగే బహిరంగ సభ వేదికపై ఎంత మంది కూర్చోవాలి, కార్యకర్తల గ్యాలరీ, మీడియా గ్యాలరీ, కళాకారుల వేదిక ఏర్పాటు బహిరంగ సభ వేదికకు కార్యకర్తలు వచ్చే దారులు విద్యుత్,తాగునీటి సౌకర్యం,వాహనాల రాకపోకలు, సీఎం కాన్వాయ్ రూటు, సీఎం వచ్చే హెలిప్యాడ్, పోలీస్ బందోబస్తు తదితర విషయలపై విఐపి సెక్యూరిటీ అధికారులు, పోలీస్ అధికారులు సభా వేదిక ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను,స్థానిక కాంగ్రెస్ నాయకులతో చర్చించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా బహిరంగ సభ స్థలం వేదిక ఉండాలని త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సిఐ రవిబాబు, ఇతర పోలీస్ శాఖ అధికారులు, ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెండేయస్వామి స్వామికి కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రత్యేక పూజలు



**అమరచింత మే 4 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీ చందర్ రెడ్డిని ప్రజలు ఆదరించాలని శనివారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో మార్కండే ఆలయంలో డిసిసి జిల్లా కార్యదర్శి,అయూబ్ ఖాన్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ ఇండ్లు లేని పేదలకు ఐదు లక్షల ఇందిరమ్మ ఇల్లు ఇస్తుందని అలాగే రైతులకు ఆగష్టులో రెండు లక్షల రుణమాఫీ రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తుందని ఆయన అన్నారు. పాలమూరు ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఆదరించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,శ్రీలను గౌడ్,కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు,ఏకే వెంకటేశ్వర్ రెడ్డి, విష్ణు,మోహన్,ఖాసిం కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా డీకే అరుణమ్మ జన్మదిన వేడుకలు

**అమరచింత మే 4 ప్రభాతవార్త:** బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణమ్మ జన్మదిన వేడుకలు శనివారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో బిజెపి కట్ట దగ్గర బిజెపి నాయకులు,కార్యకర్తలు బాణాసంచ కాల్చి,కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు ,క్యామ భాస్కర్ మాట్లాడుతూ,పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణమ్మను పాలమూరు ప్రజలు ఆదరిస్తే కేంద్రంలో డీకే అరుణమ్మకు కేంద్ర మంత్రి పదవి చేపడుతుందని పాలమూరు ప్రజల కష్టాలు తీరుతాయని ఆయన అన్నారు. అనంతరం డీకే అరుణమ్మ జన్మదినం సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేరువరాజు,దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి, నరాలనారాయణ,మరాఠీ అశోక్‌కుమార్,శ్రీనివాస్ యాదవ్, నర్సింలు,నరాల సిద్దు,అనిల్,మంగ అనిల్,బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## భానుడి భగభగ...!

◆ సూర్యతాపంతో అల్లాడుతున్న జనం ◆ రోజూ పది గంటలు నిప్పుల కొలిమి
◆ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వేడిగాడ్పులు.
◆ బిజినేపల్లిలో 46.0 గరిష్ట ఉష్ణోగ్రత



తీవ్ర ఎండలతో నిర్మానుష్యంగా మారిన మండల కేంద్రం

**బిజినేపల్లి, మే04 ప్రభాతవార్త:** భానుడి విశ్వరూపంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. గత పదిరోజుల నుండి రోజు రోజుకు ఎండలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ నెల చివరివారం నుండి ఎండలు ఠారెత్తిస్తున్నాయి. శుక్రవారం 46.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉష్ణోగ్రత పెరగడంతో పాటు ఉదయం 9 గం.ల నుండి వేడిగాలులు కూడా వీస్తున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండలు మండుతుండడంతో బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. దీంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. శనివారం ఉదయం9 గం.ల నుండి వేడిగాలులు ప్రారంభమయ్యాయి. అత్యవసరంగా పనులు ఉన్న వారు మాత్రమే బయటకు వస్తున్నారు. ఉదయం పది గంటల నుండి సాయంత్రం 5 గం.ల వరకు జన సంచారం లేక బిజినేపల్లి మండల కేంద్రం కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఇప్పుడే ఎండలు బాగా ఉండడంతో రోహిణికార్తె ప్రారంభమైతే గ్రీష్మతాపం ఇంకెంత పెరుగుతోందోనని ప్రజలు భయపడుతున్నారు. వేడిగాలులు, ఎండల నుండి ఉపవమనం పొందేందుకు ప్రజలు ఎసీలు, కూలర్లను వినియోగిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు ఇంకా పెరుగుతాయని వాతావరణ నిపుణులు ప్రకటనలు ఇస్తుండడంతో మండల ప్రజలు భయపడుతున్నారు.

**జాగ్రత్తలు పాటించకపోతే ముప్పే :** ప్రజలు వేసవికాలంలో తగి జాగ్రత్తలు పాటించకుంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఒక్కోసారి ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇతర చర్మ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని సూచిస్తున్నారు. వేసవిలో చెమట రూపంలో నీరు ఎక్కువగా బయటకు పోతుందని, ప్రతి ఒక్కరూ రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్ల నీరు తాగాలని అంటున్నారు. శీతల పానీయాలకు బదులు మజ్జిగ, పండ్ల రసాలు తాగడం ఉత్తమమని సూచిస్తున్నారు. తీవ్ర ఎండలో బయటకు వెళ్లేవారు ఇంటికి వచ్చాక నిమ్మరసం తాగాలని, కర్బూజ, దోసకాయలు, ఇతర పండ్లు తీసుకోవాలని చెబుతున్నారు. సాధ్యమైనంత వరకు నల్లటి దుస్తులు ధరించకుండా బాగా వదులుగా ఉండే తెల్లటి దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

**భూత్పూర్, మే 4, ప్రభాతవార్త :** భానుడి భగభగ రోజురోజుకు అగ్నిగుండంలా మారుతోంది. ముందెన్నడూ లేని విధంగా ఈ ఏడాది సూర్యతాపం రెట్టింపుగా ఉంది. ఇలాంటి ఎండలు దాదాపుగా 113 సంవత్సరాల తరువాత వచ్చాయని, ప్రచండ తాపంతో భానుడి ప్రకోపిస్తున్నాడని పలువురు పేర్కొంటున్నారు. భానుడు ప్రతాపం ఎనిమిది గంటలైతే సరి సూర్యుడి ప్రచండ తాపం చుట్టుముట్టి నిప్పుల కొలిమిగా మారు తోంది. ఉదయం ఎనిమిదైందంటే చాలు ఎండవేడిమి చురుక్కుమనిపిస్తోంది. సాయంత్రం ఆరైనా తగ్గని సూర్యతాపం.. భానుడి తన వేడిగాడ్పులతో జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. ఇప్పటికే ఎండవేడిమి ఈ వారం రోజులలో 43నుంచి45డిగ్రీలకు చేరుకుందంటే ఎండతాపం ఏ మేరకుంటుందో ఇంక వేరే చెప్పనకర్లేదు. ఉద్యోగులు, వ్యవసాయ కూలీ పనులకు వెళ్లేవారు ఎండవేడిమికి, భానుడి తాపానికి తట్టుకోలేక సామాన్య జనాలు చల్లటి నీడను, చెట్ల నీడ చల్లదనాన్ని వెతుక్కుంటున్నారు. అన్నదాతలు మాత్రం తలపాగలు చుట్టుకుని ఎండ నుంచి తమను తాము కాపాడు కుంటూ వ్యవసాయ పనులు చేసుకుంటు న్నారు. ఇక సామాన్య జనం మాత్రం గొడుగులు, చేతిరుమాళ్లు, టవల్స్, నూలు దుస్తులు కట్టుకుని సూర్యుని వేడిమి నుంచి కొంతవరకు ఉప శమనం పొందుతున్నారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి పుణ్యమా అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించి నందున మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాంతాలల బస్టాండులలో స్టాండ్‌లు లేక నిలువనీడలేక మహిళలు ఎండవేడిమికి అల్లాడుతున్నారనే చెప్పాలి. ఉద్యోగులు, మహిళలు, సామాన్యులు శీతలపానీయాలు, చల్లటినీళ్ళ, సామాన్యుడి ఫ్రిజ్జుగా భావించే మట్టి కుండలను తెచ్చి వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే నెల రోజులు ఎండతాపం ఏ మేరకు ఉంటుందోనన్న భయాందోళనలు చెందు తున్నారు. మే నెల చివరి వారం రోజుల వరకు ఎండ తీవ్రత మరింత పెరగనుందని నిపుణులు పేర్కొంటున్న నేపథ్యంలో ఈ నెల రోజులు ఎలా గడపాలన్న ఆవేదన ప్రతి ఒక్కరి నుంచి వ్యక్తమౌతోంది. గడచిన పక్షం రోజుల నుంచి ఎండ తీవ్రత మరీ ఎక్కువై రోడ్లపై జనసంచారమే కరువైంది. రోజుకు పదిగంటలు ఎండ తీవ్రతకు జనాలు ఇళ్లకే పరిమితమయ్యారని చెప్పకతప్పదు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఎండతీవ్రత, వేడిగాడ్పులు తీక్షణంగా వీస్తున్నాయి. వడదెబ్బబారిన పడి ఇప్పటికే చాలా మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. మరో నెల రోజుల పాటు నిండా వేసవి నిప్పుల కొలిమిగా మారునున్న నేపథ్యంలో రాబోయే పక్షం రోజుల గడ్డు పరిస్థితి దాపురిస్తుందనే పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## హోం ఓటింగ్‌ను వినియోగించుకున్న వృద్ధులు, దివ్యాంగులు



కల్వకుర్తిలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న వృద్ధురాలు

**కల్వకుర్తి, మే 04 ప్రభాతవార్త:** దివ్యాంగుల, వృద్ధుల కోసం భారత ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన హోం ఓటింగ్ విధానాన్ని మండలంలోని వృద్ధులు దివ్యాంగులు వినియోగించుకున్నారు. కల్వకుర్తి మున్సిపాలిటి కేంద్రంలో ఒకరు, చారకొండ మండల కేంద్రంలో ఒకరు, చంద్రాయనపల్లిలో ఒకరు, జూపల్లిలో ఇద్దరు, శేరి అప్పారెడ్డిపల్లి తండాలో ఒకరు చొప్పున హోం ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల అధికారులు, పోలీస్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్‌తో పాటు వీడియో గ్రాఫర్ సమక్షంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రంలో అధికారులు శంకర్‌నాయక్, మంజుల, నభి ఉన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్

**వెల్దండ, మే 04 ప్రభాతవార్త:** వేసవి కాలంల దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చడానికి ముందుకొచ్చారు సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్. మండలంలోని కుప్పగండ్ల గ్రామంలో తన జన్మదినోత్సవం సందర్భంగా గ్రామస్తులతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు శేఖర్ ముదిరాజ్‌ను అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, నర్సింహ్మా, అల్లాజీ, లక్ష్మయ్య, రాములు, వెంకటయ్యగౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.



# బిఆర్ఎస్ హయాంలోనే మైనార్టీల సంక్షేమం

◆ మహబూబ్‌నగర్ ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి
◆ బిఆర్ఎస్‌లో చేరిన మైనార్టీ నాయకులు




కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 04 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ హయాంలోనే మైనార్టీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత దక్కిందని ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ పార్టీ కార్యాలయంలో మైనార్టీల సమావేశం నిర్వహించారు. హన్వాడ మండలానికి చెందిన మైనార్టీ నాయకులు అతిక్, జహంగీర్‌తో పాటు పలువురు మైనార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎంపి మన్నె మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో హజ్‌హౌస్ నిర్మాణం రూ.కోటి నిధులు, గురుకుల పాఠశాల భవనాలు, ఇమాం, మౌసమ్‌లకు డబుల్ బెడ్ రూమ్‌లు ఇచ్చామని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ కలసి పనిచేసి బిఆర్ఎస్ అభ్యర్థులను ఓడించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చిన నాలుగు నెలలకే పరిస్థితులన్నీ తారుమారయ్యాయని రైతులకు కరెంటుకు నీళ్లకు ఇబ్బందులు మొదలయ్యాయని వివరించారు. టిఆర్ఎస్ హయాంలో సబ్బండ వర్ణాలకు న్యాయం జరిగిందని సంక్షేమం సారథి కెసిఆర్ అన్నారు. మైనార్టీ సీనియర్ నాయకులు రెహమాన్, మోసిన్, అహ్మద్, ఇమ్రాన్, మోసిన్‌ఖాన్, ఇమ్రాన్, కొండా లక్ష్మయ్య, నెత్తికొప్పుల శ్రీనివాసులు, నాగన్న, జంబులయ్య, అన్వర్, బైకాని వెంకటేష్, యాదయ్య ఉన్నారు.

# మోడీ పాలనలో ప్రభుత్వ సంస్థలు నిర్వీర్యం

◆ సిపిఎంఎల్ మాస్ లైన్, జిల్లా కార్యదర్శి సిహెచ్ రామచందర్



మాట్లాడుతున్న సిపిఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రామచందర్

**అమరచింత మే4 ప్రభాతవార్త:** నరేంద్ర మోడీ పదేళ్ల పాలనలో ప్రభుత్వ రంగ స్థల నిర్వీర్యం అయ్యాయని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి, సిహెచ్ రామచందర్‌అన్నారు. శనివారం అమరచింత మండల కేంద్రంలో మార్క్స్ భవనంలో జిల్లా కమిటీ సమావేశం ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఎన్నికలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారంలోకి వస్తే ఏడాదికి ఓటి ఉద్యో గాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. అలాగే నల్లధనాన్ని వెలికి తీసి పేదల అకౌంట్లో 15 లక్షల రూపాయలు జమ చేస్తానని హామీ ఇచ్చిన ఇప్పటివరకు ఎందుకు జమ చేయలేదని ఆయన ప్రశ్నించారు. పేదలకు, కార్మికులను, కర్షకులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కేంద్ర వ్యతిరేక చట్టాలను రద్దు చేయడానికి ఢిల్లీలో ధర్నా చేస్తున్న రైతులను కేంద్ర ప్రభుత్వం పోలీ సులతో ఉద్యమాన్ని నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరుకంగా పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు బిజెపి పార్టీని డించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. హనుమంతు, కే రాజన్న, ప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకురుమన్న ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే దంపతులను పూలమాలలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**చిన్నచింతకుంట, మే 04 ప్రభాతవార్త:** పల్లె ప్రజల ఆరాధ్యదైవం, మా కుటుంబ ఇలవేల్పు అయిన శ్రీ కురుమూర్తిస్వామి ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం తన పుట్టినరోజు సందర్భంగా శ్రీ కురుమూర్తి స్వామి ఆలయం లో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు, నియోజకవర్గ ప్రజల దీవెనలతో నియోజకవర్గానికి అన్ని రకాలుగా అభివృద్ధి చేపడతానని ఆయన తెలిపారు. జాతర మైదానంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. మండల కేంద్రంలో బస్టాండ్ కూడలిలో జన్మదిన వేడుకలలో పాల్గొని భారీ కేక్‌ను కట్ చేశారు. అంతకు ముందుదమగ్నాపూర్‌లోని తన స్వగృహంలో జన్మదిన సందర్భంగా వేద పండితులు ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులను ఆశీర్వదించారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జిఎంఆర్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. మండలంలో ఎమ్మెల్యే జిఎంఆర్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు.

# బస్సు ప్రయాణంలో యువకునికి గాయాలు



బస్సు ప్రమాదంలో గాయపడ్డ యువకులు మల్లేష్



బస్సు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

**చిన్నచింతకుంట, మే 04 ప్రభాతవార్త:** కదులుతున్న బస్సు ఎక్కబోయి ప్రమాదవశాత్తు యువకునికి గాయాలైన ఘటన శనివారం చిన్న వడ్డెమాన్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన మల్లేష్ అనే యువకుడు జిల్లా కేంద్రంలో మెకానిక్ పని చేస్తుంటాడు. ప్రతిరోజు ఉదయం 9 గం.ల ప్రాంతంలో ఆర్టీసి బస్సుకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో శనివారం యధావిధిగా బస్టాండ్‌కు రాగా బస్సులో పెద్ద సంఖ్యలో ప్రయాణీకులు ఉండడంతో బస్సు డ్రైవర్ బస్టాండ్‌లో బస్సు ఆపకుండా వెళుతుండగా కదులుతున్న బస్సును ఎక్కే క్రమంలో అదుపుతప్పి యువకుడు వెనుక భాగంలో ఉన్న టైర్ కింద కుడికాలు పాదంపై వెల్లడంతో బలమైన గాయం కాగా గ్రామస్తులు బస్సును నిలిపేసి ఆర్టీసి బస్సు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో సుమారు రెండు గంటల పాటు రోడ్డుపైనే వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బంది కలిగింది. గాయమైన యువకునికి గ్రామంలోని ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యానికి జిల్లా కేంద్రానికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు దీంతో ఆర్టీసి బస్సును గ్రామంలో నిలిపేశారు. గాయమైన యువకునికి నష్టపరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# సినీహీరో సుమన్ చేతుల మీదుగా బెల్టుల ప్రదానం



**మిడ్జిల్, మే 04 ప్రభాతవార్త :** సినీహీరో సుమన్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో శుక్రవారం మిడ్జిల్ సెంటిమీటర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు బ్లాక్ బెల్టు ప్రధానం చేశారు. ఈసందర్భంగా సినీహీరో సుమన్ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో సంతోషం, ఆరోగ్యం ఉత్సాహం, ఉల్లాసం, ఆత్మరక్షణ కొరకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు శిక్షణతో పాటు చదువుల్లో కూడా ఉన్నతమైన విద్యనభ్యసించాలని తెలిపారు. తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని వారన్నారు. విద్యార్థులను ప్రత్యేకంగా బ్లాక్ బెల్టు సర్టిఫికెట్ ప్రధానం చేసివారిని అభినందించారునీ శిక్షణను ఆల్ ఇండియా సీనియర్ కరాటే మాస్టర్ ఎండి గౌస్ విద్యార్థులకు జికె మాస్టర్ షోటోఖాన్ కరాటే శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెల్ చీఫ్ ఇలియాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్

**వెల్దండ, మే 04 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన కాటమోని కేశవులు, అదే విధంగా పెద్దాపూర్ గ్రామంలో అనారోగ్యంతో లింగం మహేష్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, పార్టీ నాయకులు సురేందర్‌రెడ్డి, వావిళ్ల సంజీవ్‌కుమార్‌యాదవ్‌లు కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల ప్రకారం మృతుడు మహేష్ భార్యకు ఇందిరమ్మ కమిటీలో వాలంటీర్ ఉద్యోగం కేటాయించనున్నట్లు తెలిపారు. అదే విధంగా సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ కాటమోని కేశవులు కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు గోళి సురేందర్‌రెడ్డి, క్యాసారపు వెంకటయ్య, హామీద్, బసనమోని శ్రీను ముదిరాజ్, మల్లేష్ ముదిరాజ్, మాసుల బాలరాజు, అన్నెపు రామస్వామి, పుట్ట యాదయ్య, చంద్రశేఖర్, గుద్దటి కిష్టాలు, రషీదు, భరత్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం



హనుమాన్ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న మాజీ ఆర్మీ ఉద్యోగి

**వెల్దండ, మే 04 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోతేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి వి.లింగమయ్యగౌడ్ రూ.50వేలను గ్రామ మాజీ సర్పంచ్ వావిళ్ల వెంకటమ్మకుఅందించారు. దేవాలయ నిర్మాణానికి విరాళాలు అందించిన లింగమయ్యగౌడ్‌ను మాజీ సర్పంచ్, దేవాలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. మరికొంత మంది దాతలు ముందుకొచ్చి దేవాలయ నిర్మాణానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## వివాహిత మహిళా అదృశ్యం



**ఊర్కొండ, మే04 ప్రభాతవార్త:** వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటన ఊర్కొండపేట గ్రామంలో చోటు చేసుకుంది. శనివారం స్థానిక ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం. ఊర్కొండపేట గ్రామానికి చెందిన కప్పెన అనూష (23) తేదీ:03-05-2024 శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని తెలిపారు. అనూష భర్త ఆంజనే యులు తన ఇంటి పరిసర ప్రాంతాల్లో బంధువుల ఇళ్లదగ్గర వెతికిన ఆమెఆచూకీలభ్యం కాలేదు. పోలీస్‌స్టేషన్‌లో ఆంజనేయులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐవీరబాబు తెలిపారు. మహిళా ఆచూకి తెలిసినలేదా ఎక్కడైనకనిపిస్తే8712657754నెంబరును సంప్రదించాలన్నారు.

## నివాళులర్పించిన ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి

**ఇటిక్యాల మే4 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బోయ దస్తగిరి అనారోగ్య కారణంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న కొండేరు గ్రామానికి చెందిన శంకరమ్మ సేవాదళం ట్రస్ట్ చైర్మన్ పోతురాజు సోమనాద్రి గ్రామనికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఆకుటుంబానికి అండగా నిలిచి 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. అంతేకాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరి వెంటహనుమంతు, బీచుపల్లి పరుశరాముడు, రాముడు, ఉమాపతి నాయుడు, కే బీచుపల్లి తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు



**ఇటిక్యాల మే 4 ప్రభాతవార్త :** మండల పరిధిలోని షేకుపల్లి గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి రమేష్ రెడ్డిలు బిఆర్ఎస్ పార్టీ నుండి శనివారం సాయంత్రం ఎర్రవల్లి చౌరస్తాలోని జన జాతర బహిరంగ సభ వేదిక వద్ద కాంగ్రెస్ పార్టీలో చేరగా వారిని కాంగ్రెస్ పార్టీలోకి ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆహ్వానించి కాంగ్రెస్ కండువా వేశారు. వీరితో పాటు గ్రామంలో 200 మంది దాకా బిఆర్ఎస్ పార్టీని నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన వారిలో న్నారు.

## స్వర్ణగిరి దేవాలయాన్ని దర్శించుకున్న టీఎన్జీఓ తాలూకా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి దంపతులు



**బాలానగర్, మే 04 ప్రభాతవార్త:** టీఎన్జీఓ తాలూకా అధ్యక్షుడు, బాలా నగర్ మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ (ఆర్ఐ) వెంకట్‌రెడ్డి, సునితరెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భువనగిరి సమీ పంలోని మానేపల్లి హిల్స్‌లో గల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాదిఏదో ఒక ఆలయంలో దేవుడిని దర్శించుకుని అక్కడ తనకు తోచిన సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆర్ఐ దంపతులు తెలిపారు.

## వీరాంజనేయస్వామి చందనోత్సవములో పాల్గొన్న మాజీ మంత్రి



**బాలానగర్, మే 04 ప్రభాతవార్త:** బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామ పంచాయతీ పరిధిలో గల తోకబండ వీరాంజనేయస్వామి చందనోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి డా. లక్ష్మారెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, టిజిసిసి చైర్మన్ వాల్యానాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శనివారం ఈ మేరకు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అభిమన్యురెడ్డి, వైస్ ఎంపిపి వెంకటాచారి, శ్రీనివాస రావు, లింగునాయక్, సుప్ప ప్రకాష్, శంకర్‌నాయక్, శ్రీధర్‌గౌడ్, చెన్నారెడ్డి, జగన్‌నాయక్, మల్లేష్ పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థిని సన్మానించిన చిన్నారెడ్డి



ఇంటర్ విద్యార్థినికి స్వీట్స్ తినిపిస్తున్న చిన్నారెడ్డి

**శ్రీరంగాపురం మే 4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఎస్సీ కాలనీకి చెందిన జె.రవి కూతురు జే.పల్లవి పెద్దమందడి బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. బైపిసి గ్రూపులో 440 మార్కులకు గాను 432 మార్కులు సాధించినందుకు మండల కేంద్రంలో శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి జె.పల్లవిని సన్మానించి స్వీట్ తినిపించి తల్లిదండ్రులను అభినందించారు. భవిష్యత్తులో మంచి చదువులు చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చి జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, శ్రీరంగాపురం జెడ్పిటిసి రాజేంద్ర ప్రసాద్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములు యాదవ్, టౌన్ అధ్యక్షులు గోవింద్, మండల ఉపాధ్యక్షులు విష్ణు, టౌన్ ఉపాధ్యక్షులు రామరాజు, కాంగ్రెస్ నాయకులుమద్దిలేటి, పి.శ్రీనివాస్, సూరేష్, రమేష్, గంగాధర్, సూరేష్, బహుజన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికులకు హెల్త్ క్యాంపు



**వనపర్తి ప్రతినిధి , మే 4ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్లో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.శ్రీనివాసులు ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా నుంచి హజ్ కు వెళ్లుతున యాత్రికులకు హెల్త్ చెకప్ లో భాగంగా 11 మంది హజ్ యాత్రికులకు రక్త పోటు , మధుమేహం పరీక్షలు చేసి వారికి మూడు ప్రాణంతక వ్యాక్సిన్ వేశారు. పిసివి వాక్సినేషన్, పీసీవీ వాక్సిన్ అనగా ప్రాణంతకంగా మారిన న్యూమోయా అను వ్యాధులను అరికట్టిందుకే ఇచ్చే వ్యాక్సిన్ 2 ఓపివి ఓరల్ పోలీయో వాక్సిన్ పోలీయో వ్యాధి రాకుండా, ఇన్ఫ్లుయేంజ వైరస్ ప్రాణంతకమైన జ్వరం, తలనొప్పి, వాంతులు, శరీరంపై నొప్పులు ఇన్ఫ్లుయేంజ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డా.పరిమళ, ఆర్‌బిఎస్‌కె డాక్టర్స్ మధు, చంద్రయ్య, అశోక్, నరసింహారావు, రత్నాకర్, రాము, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మైనారిటీ సోదరులు

**రేవల్లి మే,04 ప్రభాతవార్త:** రేవల్లి మండల పరధిలోని తల్పునూరు గ్రామ మైనార్టీ సోదరులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ మైనార్టీ అధ్యక్షులు జలీల్ ఆధ్వర్యంలో 25 మంది మైనార్టీ సభ్యులకు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ మైనార్టీ సహోదరులందరూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధికంగా మెజారిటీ తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్వతాలు, మండల ఇన్చార్జి సత్యశీలరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహ మాజీ సర్పంచ్ వెంకటయ్య నాయకులు గోవర్ధన్ యాదయ్య మైను మోగులాల్ మైనార్టీ కమిటీ అధ్యక్షులు జలీల్ షబ్బీర్ మనన్. ఖాజా షఫీ. మైబు. ఫాజిల్ . ఇటియాజ్ కాజా కమిటీ సభ్యులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి : సీఐ



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి

**కల్వకుర్తిరూరల్, మే 04 ప్రభాతవార్త:** రాబోవు పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతా వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డిలు పేర్కొన్నారు. శనివారం కల్వకుర్తి మండలంలోని పలు గ్రామాల్లోని సమస్యాత్మాక, సాధారణ పోలింగ్ కేంద్రాలను సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనల మేరకు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తోడ్పాటు అందించాలన్నారు. మండలంలో సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఆయా కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు చర్చించారు. లోకసభ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను వారు సందర్శించారు.

## బోనులో చిక్కిన చిరుతను రక్షించి నల్లమల్లకు తరలింపు



బోనులో చిక్కిన చిరుత

**అచ్చంపేట, మే 04 ప్రభాతవార్త:** శంషాబాద్ విమానాశ్రయంలో బోనులో చిక్కిన చిరుత పులిని రక్షించి అటవీశాఖ అధికారులు అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాంతంలో విడిచిపెట్టినట్లు మున్ననూరు అటవీ శాఖ అధికారి ఈశ్వర్ తెలిపారు. చిరుతపులిని శంషాబాద్ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన బోనులో చిక్కిందని, అటవీ శాఖ అధికారులు చిరుత పులిని రక్షించి నెహ్రూ జూపార్కు తరలించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా చిరుత పూర్తి ఆరోగ్యంగా ఉండటంతో శుక్రవారం రాత్రి 12 గంటలకు అమ్రాబాద్ టైగర్ రిజర్వులో అటవీశాఖ అధికారులు విడిచిపెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అమ్రాబాద్ టైగర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## 6న బీజేపీ రోడ్‌షోకు అన్నమలై రాక



సభ స్థలాన్ని పరిశీలిస్తున్న తల్లోజు ఆచారి

**కల్వకుర్తి, మే 04 ప్రభాతవార్త:** ఈ నెల 6న కల్వకుర్తి పట్టణంలో బీజేపీ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రోడ్డు షో, కార్నర్ సమావేశం నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టణంలో బీజేపీ రోడ్ షో, కార్నర్ సమావేశానికి ముఖ్య అతిథిగా తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు అన్నమలై కల్వకుర్తికి విచ్చేస్తున్న సందర్భంగా స్థానిక శివాజీ చౌక్ వద్ద కార్నర్ సమావేశం కోసం సభా స్థలాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి జక్క రఘునందన్‌రెడ్డిలు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ యువకులతో పెద్ద ఎత్తున రోడ్ షో నిర్వహిస్తున్నామని, మరోసారి నరేంద్రమోడీ గెలువడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మొగిలి దుర్గప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, నరసింహ, రాంభూపాల్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, నరేష్‌గౌడ్, పుట్ట చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## యువజన క్రీడా ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్

**కల్వకుర్తిటౌన్, మే 04 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో యువజన క్రీడా ఆధ్వర్యంలో పది చోట్ల సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని అందులో భాగంగా కల్వకుర్తి మండలం కుర్మిద్ద గ్రామంలో ఉన్న పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని మాస్టర్ నాగరాజు తెలిపారు. క్యాంప్ ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు తైక్వాండో కుంగ్‌ఫ్, కిక్ బాక్సింగ్ కోచింగ్ ఇస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 6305666405 నెంబరును సంప్రదించాలన్నారు.

## ధరలను అరికట్టడంతో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలం

● సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

**అలంపూర్ మే 4 ప్రభాతవార్త :** మతోన్మాద బిజెపి పార్టీని బిజెపికి లోపాయికారిగా మద్దతు తెలుపుతున్న బిఆర్ఎస్ పార్టీని ఓడించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏఐసీసీ కార్యదర్శి సంనత్ కుమార్ సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం శాంతినగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మల్లు రవి కుమారుడు సిద్ధార్థ మల్లుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. గత పది సంవత్సరాలుగా దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపి నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ దేశ ప్రజలకు తీరని నష్టం చేశారని నిత్యవసర సరుకుల ధరలు పెట్రోల్ డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని ధరలను అరికట్టడంతో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని సంవత్సరానికి రెండు కోట్ల ఉదో గాలు ఇవ్వకపోగా దేశంలో ఉద్యోగాలు చేస్తున్న యువతను ఉద్యోగాల నుంచి తొలగించి నిరుద్యోగులుగా మార్చారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కారు చౌకగా ప్రైవేటు పట్టబడుదారులకు అమ్మేశారని అన్నారు. ప్రజల మధ్య మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని అన్నారు. బిజెపిని ఓడిస్తేనే దేశ ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో బిజెపికి లోపాయికారీగా మద్దతునిస్తూ బిఆర్ఎస్ పనిచేస్తుందని బిజెపితో జత కట్టిన బిఆర్ఎస్ పార్టీని కూడా ఓడించాలని ఇండియా కూటమిలో భాగమైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని ప్రజలందరూ ఓట్లు వేసి త్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సిపిఎం పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి సంపూర్ణమైన మద్దతు తెలుపుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి తెలిపారు. కార్యక్రమంలో మల్లు రవి కుమారుడు సిద్ధార్థ మల్లు,సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏ.జ్యోతి సిఐటియు జిల్లా నాయకులు హమాలీ యూనియన్ అధ్యక్షులు నాయకి భీమన్న,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇస్మాయిల్,షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్‌కు జడ్చర్ల ఇసుక!

● పట్టుకున్న ఇసుక ఫలహారం

● మహబూబ్‌నగర్ బస్టాండ్‌లోని నిర్మాణ పనులకు జడ్చర్లలో సీజ్ చేసిన ఇసుక

● తరలించింది 70 ట్రాక్టర్లు... బస్టాండ్‌లో ఉన్నది 30 ట్రాక్టర్‌ల ఇసుకే...?





**జడ్చర్ల,మే 04 ప్రభాతవార్త:** స్థానిక జడ్చర్ల మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో సీజ్ చేసి నిల్వ ఉంచిన ఇసుకను జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో దుకాణాల నిర్మాణ పనులకు అని జడ్చర్ల నుండి మహబూబ్‌నగర్‌కు ఇసుకను తరలిస్తున్నారు. మహబూబ్‌నగర్ మండలంలో ఇసుకనే దొరకడం లేదా ఇక్కడ జడ్చర్లలో ఉన్న గృహ నిర్మాణ యజమానులు వేల రూపాయలు వెచ్చించి ఇసుకను కొనుగోలు చేయడానికి ఎదురు చూస్తున్నా ఇసుక దొరకడం లేదు. ఇలాంటి తరుణంలో అక్రమ ఇసుక రవాణా పనులలో అధికారులు బిజీగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విషయంపై స్థానిక తహసిల్దార్‌ని వివరణ కోరగా తరలిస్తున్న ఇసుకను జిల్లా కలెక్టర్, మైనింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో దుకాణాల నిర్మాణ పనులకు వినియోగిస్తున్నట్లు వివరణ ఇచ్చారు. ఇసుక కేటాయింపులో కొసమెరుపు ఏమంటే మార్కెట్లో ట్రాక్టర్ 5 వేలు నుండి 6 వేల వరకు అమ్ముడయ్యే ఇసుకను ఆర్టీసి దుకాణాల నిర్మాణ గుత్తేదారుకు కేవలం 750 రూపాయలు తక్కువ ధరకే అప్పనంగా అప్పగించి గుత్తేదారుపై వాత్సల్యం ప్రదర్శించారు. స్థానికంగా ఇసుక కొరతతో ప్రభుత్వ, ప్రైవేట్ పనులు ఆగిపోయినను పట్టించుకోని అధికారులు ఇక్కడ మాత్రం ముందుగా 70 ట్రాక్టర్లు 210 క్యూబిక్ మీటర్లకు సమానం అగు ఇసుకను గుత్తేదారుకు కేవలం 50,500ల డిడి చెల్లిస్తేనే అప్పగించారు. నిజానికి



ప్రభుత్వ నిబంధనల ప్రకారం అయినా ఈ ఇసుకకు దాదాపు రెండు లక్షల మేర చెల్లించాలి. అధికారులు చెప్పినట్లుగా ట్రాక్టర్లు మూడు క్యూబిక్ మీటర్ల ఇసుక తరలిస్తున్నామని చెప్పినను వాస్తవికంగా ప్రతి ట్రాక్టర్‌లో పేపర్ లోడుతో ఓవరు లోడు నింపుకొని దాదాపు నాల్గు క్యూబిక్ మీటర్ల ఇసుక తరలిస్తున్నారు. ఒకవేళ ట్రాక్టర్‌లో మూడు క్యూబిక్ మీటర్లు తరలించిన 750 రూపాయలు అంటే క్యూబిక్ మీటర్‌కు రూ 250లకే ఎక్కడ అందు బాటులో ఉందో చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రభుత్వ ధరల ప్రకారం అయిన దాదాపు రూ. 2900 ఉంటుందని, మరీ రూ. 750 కి పోను మిగతా డబ్బులు ఎవరి జేబులోకి వెళ్తున్నాయని జడ్చర్ల జనం ప్రశ్నిస్తున్నారు. ఇలా అనుమతి పత్రం పేరుతో తరలించిన వాహనాలకు కొన్నింటికి నంబర్ ప్లేట్లు కూడా లేవు. జడ్చర్ల తహసిల్దార్ కార్యాలయం నుండి మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు వెళ్లాలంటే ప్రధాన రహదారి గుండా వెళ్లాలి. కానీ సదరు గుత్తేదారు మనుషులు ట్రాక్టర్‌లను దారిమళ్లించి జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో నిర్మాణంలో ఉన్న ప్లాట్ ముందు రూ 6 వేల చొప్పున అమ్ముతున్నారని తెలిసింది. కేవలం శుక్రవారం అధికారుల లెక్కల ప్రకారం 30 ట్రాక్టర్లు తరలించామని చెబుతున్నారు. కానీ అనధికారికంగా శుక్రవారం 100 ట్రాక్టర్లు తరలించాలని ప్రత్యక్ష సాక్షులు, పట్టణ ప్రజలు చెబుతున్నారు. ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని చెబుతున్న నేటివరకు జడ్చర్లలో ఏ ఒక్క నిర్మాణదారుకు, ప్రభుత్వ పనులు చేస్తున్న గుత్తేదారులకు సరఫరా చేసింది లేదని జడ్చర్ల జనం పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయమై జడ్చర్ల తహసిల్దార్‌కు మైనింగ్ శాఖ అధికారులకు, ఎమ్మెల్యేకు, గత రెండు రోజులుగా సెల్‌ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేస్తున్నా చర్యలు చేపట్టడం లేదని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రతిపక్షాల నాయకులు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులకు అని, అనుమతుల పేరిట జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లిలో సీజ్ చేసిన ఇసుకను దాదాపుగా 500ల టిప్పర్ ఇసుకను అక్రమంగా తరలించి పట్టణంతో పాటు, వెరికో ఫార్మాతో పాటు వివిధ కంపెనీలకు, జిల్లా కేంద్రంలోని గృహ నిర్మాణదారులకు అధిక ధరలకు గుత్తేదారులు అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు బాహాటంగానే ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ఇందులో అధికారులకు, నాయకులకూ, వాటాలు ముడుతున్నాయని సమాచారం. ప్రభుత్వ ధర అయినా కనీసం రూ. 650 తగ్గదని క్యూబిక్ మీటర్‌కు రూ. 250లకే గల మతలబేందో బయట పెట్టాలని జనం డిమాండ్ చేస్తున్నారు.

**అన్‌లోడింగ్ దగ్గర 30 ట్రాక్టర్ల ఇసుకే....**

జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో నిర్మాణం జరుగుతున్న దుకాణాల సముదాయాల వద్ద ఆన్‌లోడింగ్ పాయింట్‌కు వెళితే అక్కడ 30 ట్రాక్టర్ల ఇసుకే ఉండడం.



# నడిగడ్డలో జోరుగా అక్రమ కలప దందా..

● పట్టించుకోని అధికారులు...

● మండే ఎండలకు బయటకు రాలేని అధికారులు

● అదే అదునుగా తీసుకున్న అక్రమార్కులు





రాత్రి,పగలు జోరుగా అక్రమ కలపను తరలిస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి మే 4 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలోని విచ్చలవిడిగా చెట్లను అక్రమంగా నరికి మూడు పూలు,అరుకాయలుగా అక్రమార్కులు వ్యాపారం చేసుకుంటున్నారని జోరుగా ప్రచారం జరుగుతుంది.గత జనవరి నెల నుండి ఇప్పటి వరకు నడిగడ్డ ప్రాంతంలో జోరుగా చెట్ల నరికివేత జరుగుతుందని పలువురు రైతులు,గ్రామస్తులు అంటున్నారు. మండే ఎండల్లో అధికారులు బయటికి రాలేని గమనించిన అక్రమార్కుల కలప దందాను స్పీడ్ పెంచినట్లు తెలుస్తుంది.ఎవరైనా తమ ఇళ్ల ముందు నాటిని వృక్షాలను నరకాలన్నా అటవీశాఖకు ఒక్కో చెట్టుకు రూ.500 చొప్పున ఆన్లైన్లో చలానా చెల్లించి అనుమతి పొందాల్సి ఉంటుంది.కానీ ఆలా లేదని, ఇక్కడ ఫారెస్ట్ అధికారులే అక్రమార్కులతో చేతులు కలిపి ఈ దందాను నడుపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.అలాంటిది రహదారుల పక్కన, అడవుల్లో పెరిగిన చెట్లను కొంతమంది అక్రమార్కులు యథేచ్ఛగా కొట్టివేస్తూ మొద్దులను అమ్ముకుని సొమ్ము చేసుకుంటూన్న ఎలాంటి చర్యలూ ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి.ప్రతి రోజు 10 నుండి 20 ట్రాక్టర్ల ద్వారా అక్రమ వ్యాపారం జరుగుతున్న అధికారులకు తెలిపిన ఈ అక్రమ వ్యాపారాన్ని అరికట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.గద్వాల నుండి ఐజకు వెళ్లే రహదారిలో రెండు తూకం కాంటలు ఉన్నాయి.అక్కడ ఉదయం నుండి సాయంత్రం దాకా సమారు 10 నుంచి 20 ట్రాక్టర్లు తూకం వేసుకుని అనుమతులు లేని,అనుమతులు ఉన్న కట్టెల మండీలకు అమ్ము కొంటున్నట్లు సమాచారం అయితే ఫారెస్టు అధికారులే అక్రమార్కులకు కొన్ని ఉపాయాలు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.ఒక ట్రక్టర్ కు ప్రతి నెలకు రూ.10 వేలు మాముళ్ల ఇస్తున్నట్లు ప్రచారం అవుతున్నది.ఐదుగురు అధికారులు,సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల అక్రమార్కులను అడ్డుకోలేక పోతున్నామని కొందరు అధికారులు పై అధికారులకు సమాచారం ఇచ్చి చేతులు దులుపు కొంటున్నట్లు సమాచారం.ఇక్కడ కొందరు సిబ్బంది చాలా కాలంగా పని చేయడం వల్ల అక్రమ వ్యాపారస్థులకు సహకరిస్తున్నట్లు సమాచారం హరితహారంలో భాగంగా జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో గత ఎనిమిదేళ్లల్లో రెండు కొట్లకు పైగా మొక్కలు నాటినట్లు గణాంకాలు చెబుతున్నాయి.క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అవి ఎక్కువగా నరికి వేతకు గురైనట్లు తెలుస్తుంది.ప్రస్తుతం అక్కడక్కడ కొట్టి వేసునతన్న చెట్లు 15 ఏళ్ల కిందట నాటినవి అని పలువురు అంటున్నారు.వాహనాల్లో ప్రతి రోజు మొద్దులు తరలింపు జరుగుతున్న ఎవరు పట్టించు కోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.అడ్డుకునేవారులేరని పలువురు అంటున్నారు. చెట్లు అడ్డంగా నరికేస్తున్నారు దిక్కు,దివాణం లేదని పలువురు అంటున్నారు. సంరక్షించకపోవడంతో అటవీశాతం పెరగడం లేదు.జిల్లాలో మొత్తం 765 హెక్టార్‌లలో అడవులుండగా ఇవన్నీ దాదాపు గట్టు మండలంలోనే ఉన్నాయి.అటవీభూముల్లోనూ ఏటా మొక్కలు నాటుతున్నారు.వేసవిలోవాటికి నిటిని పోసందుకు ప్రత్యేక నిధులు, యంత్రాంగం లేకపోవడంతో ఎండిపోతున్నాయి అని అధికారులు అంటున్నారు.జిల్లాలో అడవుల సంరక్షణ చూసేందుకు ఫారెస్టు రేంజ్ అధికారి, డిప్యూటీ రేంజ్ అధికారి,మరో ముగ్గురు సిబ్బంది మాత్రమే జిల్లాకు కూడా పని చేస్తుండటంతో ఆయన ఎక్కువగా అక్కడే ఉంటున్నారనే సమాచారం .చెట్ల సంరక్షణ,అడవుల పెంపకంపై అవగాహన కార్యక్రమాలు కూడా పెద్దగా నిర్వహించకపోవడంతో కొంతమంది తమ స్వార్ధానికి వృక్షాలను నరికివేస్తున్నారని ప్రచారం జరుగుతుంది.చదువుకున్న వాళ్లకు కూడా ఒక్కో చెట్టు నిరికివేసేందుకు ప్రభుత్వానికి ఆన్లైలో రూ.500 చొప్పున చలానా చెల్లించాలనే విషయం తెలియడంలేదు.టన్ను రూ.5వేలకు పైగా ఉండటంతో వివిధ చెట్లకు సంబంధించి ఉండే డిమాండు ను బట్టి టన్ను కలప ధర రూ.5 వేలకు పైగా పలుకుతుండటంతో అక్రమార్కులు చెట్ల నరికివేతను సొమ్ముచేసుకుంటున్నారు.సాధారణంగా వృక్షాల మొద్దులను టింబర్ డిపోలకు ఎక్కువగా తరలిస్తుండగా,కొంత మంది ఇటుక,బొరుగుల బట్టీల నిర్వాహకులకు అమ్ముతుంటారు.టింబర్ డిపోల్లో కోసే మొదుదలకు సైతం రికార్డులు సక్రమంగా నిర్వహించాలి కానీ కొంత మంది అధికారులను మభ్య పెట్టి పెద్ద ఎత్తున కలపను అక్రమంగా వివిధ పనులకు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.అక్రమంగ కట్టెలు సరఫరా చేసే వ్యాపారుల నుండి ,లైసెన్స్,లేని,ఉన్న కట్టెల కోత మిషన్‌లు నడిపే వ్యాపారుల నుండి, నర్సరీల భూముల అద్దె,నిర్వాహకుల నుండి,బొగ్గుల,ఇటుక బట్టీల యజవానుల నుండి,అటవీ అభివృద్ధి పనులలో మామూళ్లు ఫుల్ గా అధికారులకు సమాచారం పెంచికల పాడు,గట్టు మండలం పరిధిలో జరిగిన పనులో కూడా అవినీతి అక్రమాలు జరిగినట్లు సమాచారం గత రెండు రోజుల కిందట విజిలెన్స్ అధికారులు గద్వాలకు వచ్చి వెళ్లినట్లు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తుంది.అక్రమ కలప వ్యాపారంపై జిల్లా కలెక్టర్,ఫారెస్ట్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# అనన్యరెడ్డికి ఘన సన్మానం

### మహబూబ్‌గర్ ప్రతిభ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహణ




అనన్య రెడ్డిని సన్మనిస్తున్న ప్రతిభ కళాశాల యాజమాన్యం

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 04 ప్రభాతవార్త:** ఇటీవల ప్రకటించిన యుపిఎస్సీ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్యరెడ్డికి జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు రావడంపై ప్రతిభా కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దోనూరు అనన్యరెడ్డిని అభినందించి సన్మానించారు. జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించి, తల్లిదండ్రులకు, గ్రామానికి కాకుండా జిల్లాకు, ఈ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందని కొనియాడారు. మొదటి ప్రయత్నంలోనే సివిల్స్‌లో జాతీయ స్థాయిలో రాణించడం గొప్ప విషయమన్నారు. అభినందన సభలో ప్రతిభ కళాశాల విద్యార్థులు వందల సంఖ్యలో హాజరయ్యారు. అనన్యరెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు భవిష్యత్తులో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అనన్యరెడ్డి విద్యార్థి దశనుంచే ప్రతి ఒక్కరూ లక్ష్యంతో ముందుకు సాగాలని, క్రమశిక్షణ,హార్డ్‌వర్క్‌తో తప్పక విజయం సాధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రతిభా కళాశాల డైరెక్టర్స్ లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలప్రసాద్, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ వెంకట్రామయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనన్యరెడ్డి




ప్రతిభ కళాశాల విద్యార్థులతో అనన్యరెడ్డి

## కురుమూర్తిరాయుడి సాక్షిగా రుణమాఫీ చేస్తా..

(మొదటి పేజీ తరువాయి)

నాకు అవకాశం వస్తే నాపై విషం కక్కుతున్న డీకే అరుణకు ఓటు వేస్తారా అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా పరిధిలో మాదిగలు ఎక్కువ శాతం ఉన్నారని 30 ఏండ్ల నుండి మాదిగల ఏబీసీడీ వర్గీకరణ చేయకుండా అడ్డుకుంది. బీజెపి కాదా అని ప్రశ్నించారు. వంశీచంద్‌ను గెలిపిస్తే పార్లమెంటులో మీ గొంతును వినిపిస్తాడని తెలిపారు. వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వారి న్యాయమైన డిమాండును పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం మోడీ ఏమిచ్చిండు గాడిద గుడ్డు మోడీ ఏం తెచ్చిండు గాడిద గుడ్డు అనే నినాదంతో మీటింగు మొత్తం కార్యకర్తల ధ్వనులతో మారుమోగింది. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గానికి కావాల్సిన అభివృద్ధి పనులు వివరించారు. కొత్తకోట పట్టణ కేంద్రానికి డిగ్రీ కళాశాల, 50 పడకల హస్పిటల్ కావాలని ముఖ్యమంత్రి ని అడిగారు. అలాగే కానాయపల్లి శంకర సముద్ర నిర్వాసితులకు 100 కోట్లు కావాలని సీఎం ను కోరారు. అనంతరం పాలమూరు పార్లమెంటు అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లడుతూ ఈ ఎన్నికలు కులానికి సంబంధించావో, లేక పార్టీలకు సంబంధించినవో కావు కేవలం పాలమూరు ఆత్మగౌరవానికి జరుగుతున్నా ఎన్నికలు అని అన్నారు. పాలమూరు అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని తప్పనిసరిగా మీరు నన్ను గెలిపించి పార్లమెంటు కు పంపిస్తే మీకు అండగా ఉంది. అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఢిల్లీ అధికార ప్రతినిధి జితేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, మాజీ జెడ్పిటిసి బాబు, కరుణాకర్ రెడ్డి, బిచుపల్లి మేస్త్రి శ్రీను, కృష్ణారెడ్డి, ప్రశాంత్, బోయిజ్, మీషేక్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

